సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



క్షేత్రస్థాయిలో విచారణ..

8లో

స్పందనలో కలెక్టర్, జేసీ 214 అర్జీలు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో విచారించి వినతులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



నిర్దేశిత సమయానికే దర్శనం

చందనోత్సవంలో సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. టైమ్ స్లాట్ ప్రకారం దర్శనం కల్పించనున్నారు.

8లో



సూపర్.. సీతకొండ సీ వ్యూ

విశాఖ: శివారులోని సీతకొండ సీ వ్యూ పాయింట్ సందర్శకులను కట్టిపడేస్తోంది. జీ–20 సదస్సు పుణ్యమాని దీనిని అభివృద్ధి చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
అనకాపల్లి	6-17	4-22
నర్సీపట్నం	6-20	4-22

దొంగ దొరికాడు

- నెల రోజుల వ్యవధిలో 9 దొంగతనాలు
- తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్
- చోరీ ఘటనలపై స్పెషల్ డ్రైవ్‌తో సత్ఫలితం



నిందితుడిని ప్రదర్శించి, మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ, చిత్రంలో అడిషనల్ ఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది

సాక్షి, అనకాపల్లి: రెండు మూడు రోజులపాటు ఇంటికి తాళం వేసి ఉంటే చాలు కన్నేస్తాడు.. ఒకటి రెండు రోజులు పరిశీలిస్తాడు.. మధ్యాహ్నం లేదా అర్ధరాత్రి సమయంలో సునాయాసంగా పనిముగించేస్తాడు.. నెల రోజుల వ్యవధిలో జిల్లాలో 9 ఇళ్లను దోచుకున్న ఘరానా దొంగ చాకచక్యమిది.. అయితే కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చోరీ కేసుల పరిష్కారంపై స్పెషల్ డ్రైవ్ పెట్టడంతో సోమవారం పోలీసు వలకు చిక్కాడు. అతను కె.కోటపాడు, అనకాపల్లి రూరల్, చోడవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట, వి.మాడుగుల మండలాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు గుర్తించారు. వీటిలో ఒకటి మినహా మిగతా ఎనిమిది దొంగతనాలు తాళం వేసి ఉన్న ఇళ్లలోనే జరిగాయి. అతని వద్ద రూ.3,61,800 నగదు, 17 3/4 తులాల బంగారం, 115 తులాల వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చీడికాడ, మాడుగుల, చోడవరం మండలాల్లో గతంలో జరిగిన చిన్నపాటి దొంగతనాలను సైతం ఇతనే చేసినట్టు గుర్తించారు. చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన నిందితుడు పిల్లి నూకరాజును, అతను దోచుకున్న సొత్తును ప్రదర్శిస్తూ ఎస్పీ సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం నిందితుడిని న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా 14 రోజుల పాటు రిమాండ్ విధించారు.

సత్ఫలితమిచ్చిన స్పెషల్ డ్రైవ్

ఎస్పీగా కె.వి.మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరించిన మరుక్షణమే క్రైం విభాగం పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏడాదిగా జిల్లాలో ఎన్ని దొంగతనాల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరా తీశారు. కొత్త జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎన్ని దొంగతనాలు జరిగాయి..? వాటిలో ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో తెలుసుకున్నారు. పరిష్కారం కాని దొంగతనాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. వాటిని త్వరితగతిన విచారించాలని ప్రత్యేక బృందాలను కూడా ఏర్పాటు చేశారు. ఎక్కువగా దొంగతనాలు జరిగే ప్రాంతంలో చెక్ పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా పాత నేరస్తులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ పి.సత్యనారాయణరావు, అనకాపల్లి ఇన్‌చార్జి డీఎస్పీ ఎం.మహేశ్వరరావు ఆధ్వర్యంలో పకడ్బందీగా పోలీస్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. సోమవారం ఉదయం సుమారు 9.30 గంటల సమయంలో కోటపాడు మండలంలో మేడిచర్ల జంక్షన్ దగ్గర ముందస్తు సమాచారంతో కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు, ఎస్సై రాజాన ధనుంజయ బృందం తనిఖీలు చేస్తూ.. నిందితుడు పిల్లి నూకరాజును అదుపులోకి తీసుకున్నారు. అతనిని విచారించడంతో కె.కోటపాడు, అనకాపల్లి రూరల్, చోడవరం, చీడికాడ, బుచ్చెయ్యపేట, వి.మాడుగుల పోలీస్ స్టేషన్ల పరిధిలో తొమ్మిది ఇంటి దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు.

దొంగతనాలు ఇవే...

- ఈనెల 4న బుచ్చెయ్యపేట మండలం కోమళ్లపూడిలో ఆటోడ్రైవర్ పాము రాము ఇంట్లో ఎవరూ లేని సమయంలో బైక్‌పై వచ్చి ఇంటి తాళాలు పగులగొట్టి 8 తులాల బంగారం, 34 తులాల వెండి ఆభరణాలు, రూ.18,500 నగదు అపహరించుకుపోయారు.
- కె.కోటపాడులో 11వ తేదీన పట్టపగలు పక్కపక్కనే వున్న మూడిళ్లలో చోరీలు జరిగాయి. 8 తులాల బంగారు నగలు, లక్షా 90 వేల రూపాయల నగదు అపహరించుకుపోయారు.
- చోడవరంలో రెండు చిన్నపాటి దొంగతనాలు జరిగాయి. వెంకన్నపాలెంలో రూ.5 వేలు, వెంకన్నపాలెం రోడ్డు ఆనుకుని ఉన్న షోరూం యజమాని ఇంట్లో లాప్‌టాప్, రూ.10 వేల నగదు దొంగతనం జరిగింది.
- అనకాపల్లి గాంధీనగర్‌లో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి 7 తులాల బంగారం దోచుకుపోయారు.
- 10వ తేదీన మాడుగుల మండలం జంపన గ్రామంలో ఇంటి తాళాలు పగలుకొట్టి రెండున్నర తులాల బంగారం చోరీ జరిగింది. అదేరోజు మాడుగుల మండలం వీరనారాయణం గ్రామంలో అర తులం, రూ.20 వేల నగదు దొంగతనం జరిగింది.
- వీటితోపాటుగా చీడికాడలో ఈనెల 8న చిన్నపాటి దొంగతనాలకు పాల్పడ్డాడు. అయితే ఈ కేసుల్లో బాధితులు పోలీసులను ఆశ్రయించలేదు.

స్వాధీనం చేసుకున్న సొత్తు

- రూ.3,61,800 నగదు
- 17 3/4 తులాల బంగారం
- 115 తులాల వెండి

సెలవులకు ఊరెళ్తున్నారా..?

- వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వండి
- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో దొంగతనాలకు చెక్
- మీడియాతో ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: వేసవి సెలవుల్లో తీర్థయాత్రలకు బయల్దేరేవారు, సొంత ఊళ్లకు వెళ్లేవారు స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇచ్చి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)లను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా జరిగిన దొంగతనాల్లో ఎక్కువగా తాళాలు వేసిన ఇళ్లే ఉన్నాయన్నారు. ఇటీవల వరుసగా 9 దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కి పంపినట్లు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు, ఎస్ఐలు రాజాన ధనుంజయ, బి.రామకృష్ణ, సిబ్బంది పి.సాయిబాబా, లీలా ప్రసాద్, హోంగార్డులు పైడపునాయుడులను అభినందించి, నగదు పురస్కారం అందించారు. విలువైన నగలు, డబ్బును లాకర్లలో భద్రపరచుకోవాల్సిందిగా సూచించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- సెలవులకు ఊరెళ్తే తలుపులు, కిటికీలు సరిగా లాక్ చేయాలి.
- బీరువాల్లో విలువైన వస్తువులు ఉంచొద్దు. వాటి తాళాల్ని కూడా వెంట తీసుకెళ్లండి.
- మీ ఇరుగుపొరుగు వారికి మీ ఇంటిని గమనించాల్సిందిగా చెప్పండి.
- తాత్కాలికంగా ఇంట్లో లేనప్పుడు, లైట్లు ఆన్ చేసి ఉంచితే మంచిది. అలా చేస్తే ఇంట్లో ఎవరో ఉన్నట్లుగా ఉంటుంది.
- రోజూ న్యూస్ పేపర్‌ను ఇరుగు పొరుగు వారిని తీసుకోవాల్సిందిగా చెప్పండి.
- తలుపు ద్వారాలు, పూల కుండీల దగ్గర తాళాలు పెట్టేకంటే, పొరుగువారికిచ్చి వెళ్లండి.

విశాఖలో మాజీ ఉపరాష్ట్రపతి



వెంకయ్యనాయుడికి స్వాగతం పలుకుతున్న పోర్టు చైర్మన్ రామచంద్రన్

సాక్షి, విశాఖపట్నం: మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం విశాఖపట్నం చేరుకున్నారు. పోర్ట్ ట్రస్ట్ అతిథి గృహానికి చేరుకున్న ఆయనకు పోర్ట్ చైర్మన్ టి.కె.రామచంద్రన్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చైర్మన్ వివరించారు. మాజీ ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, సెక్రెటరీ వేణుగోపాల్, పోర్టు అధికారులున్నారు.

పలు రైళ్లు రద్దు

విశాఖ: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే, సంబల్‌పూర్ డివిజన్ టిట్లాఘడ్–తెరుబలి మధ్య వంతెన పునర్నిర్మాణ పనుల నిమిత్త పవర్ బ్లాక్, ట్రాఫిక్ బ్లాక్ తీసుకుంటున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు.

- విశాఖలో ఈ నెల 21న బయల్దేరే విశాఖ–రాయ్‌పూర్ (08527) పాసింజర్ స్పెషల్ రద్దు, రాయ్‌పూర్‌లో ఈ నెల 21న బయల్దేరే రాయ్‌పూర్–విశాఖ (08528) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు.
- ఈ నెల 20న నిజాముద్దీన్‌లో ఉదయం 7గంటలకు బయల్దేరవలసిన నిజాముద్దీన్–విశాఖ (12808) సమతా ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా ఉదయం 9.30గంటలకు బయల్దేరుతుంది. తిరుపతిలో ఈ నెల 20న ఉదయం 10.50గంటలకు బయల్దేరవలసిన తిరుపతి –బిలాస్‌పూర్(17482) ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.50గంటలకు బయల్దేరుతుంది.

న్యూస్‌రీల్

వేసవి జాగ్రత్తలు తప్పనిసరి



కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల : వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన జిల్లాస్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధి కూలీలకు సంబంధించి సంబంధిత శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 7 నుంచి 11 వరకు, మధ్యాహ్నం 3 తర్వాత మాత్రమే పనులు చేయించాలన్నారు. అవసరమైన నీరు, నీడ తదితర సౌకర్యాలు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పరిశ్రమలు, ఇసుక, క్వారీ, వ్యవసాయ రంగంలో పనిచేసే కార్మికులు, కూలీలకు తగిన సూచనలు చేయాలన్నారు. వడదెబ్బ, వడగాల్పుల బారినపడి ప్రజలు ఇబ్బందులు పడకుండా, వైద్య ఆరోగ్యశాఖ అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో జేసీ జాహ్నవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోర్టులో రికార్డు స్థాయి లోడింగ్

1,02,200 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్

సాక్షి, విశాఖపట్నం : మరో అరుదైన రికార్డును విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) తన ఖాతాలో వేసుకుంది. ఇన్నర్ హార్బర్‌లో పోర్టు చరిత్రలో తొలిసారిగా అత్యధికంగా ఐరన్ ఓర్ ధాతువుల లోడింగ్ చేస్తూ రికార్డు సృష్టించింది. 1,02,200 మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్‌ని ఏకకాలంలో పార్సిల్ లోడింగ్ చేసినట్లు పోర్టు అధికారులు ప్రకటించారు. గతంలో లక్ష మెట్రిక్ టన్నుల లోడింగ్ మాత్రమే ఇప్పటివరకు రికార్డుగా ఉండేది. సోమవారం యూరో ప్రతీక్ ఇస్పాత్ లిమిటెడ్ సంస్థకు సంబంధించిన ఐరన్ ఓర్ ఫైన్స్‌ని బోత్రా షిప్పింగ్ సర్వీస్ ఏజెన్సీ ఈక్యూ9 బేబీకేప్ వెసల్‌లో రికార్డు స్థాయిలో లోడ్ చేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే కన్నబాబురాజుకు శివాజీ సోదరుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో శివాజీ సోదరులు

మునగపాక: తాను కొంతమంది దుష్టశక్తుల మాటలు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబురాజు)తో వివాదానికి దిగానని నాగులాపల్లికి చెందిన మళ్ల శివాజీ తెలిపారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసి క్షమాపణ కోరానన్నారు. ఈ సందర్భంగా శివాజీ సోదరుల కుటుంబ పరిస్థితులపై ఆరా తీసిన రమణమూర్తిరాజు స్పందించి ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడంతోపాటు శివాజీ సోదరుడు సాయికి అచ్యుతాపురంలో ఎస్ఈజెడ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పారు. దీంతో శివాజీ సోదరులు ఎమ్మెల్యే రమణమూర్తిరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

23న గురుకులాల ప్రవేశ పరీక్ష

కంచరపాలెం : రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి (2023–24) ఈ నెల 23న పరీక్ష నిర్వహించనున్నట్లు ఉమ్మడి విశాఖ జిల్లా గురుకులాల సమన్వయ కర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లాలో 3, అనకాపల్లి జిల్లాలో 8 గురుకులాల్లో 5వ తరగతిలో 880 సీట్ల కోసం 3,496 మంది విద్యార్థులు, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 880 సీట్లకు 1,969 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 5వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. 5వ తరగతి విద్యార్థులు http;//apgpcet.apcfss.in, ఇంటర్ విద్యార్థులు http;//apgpcet.apcfss.in/inter వెబ్‌సైట్ ద్వారా ఈనెల 18 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641, 7207000723 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎండ మండే..

కోటవురట్ల @43.56°

- ఉమ్మడి విశాఖ కుతకుత
- మరో మూడు రోజులు వడగాడ్పులు



సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ కుతకుతలాడుతోంది. ఉష్ణతాపం నిప్పుల కుంపటిని తలపిస్తోంది. సాధారణంకంటే నాలుగైదు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ దడ పుట్టిస్తున్నాయి. వరసగా వారం రోజుల నుంచి వడగాడ్పులు వీస్తూనే ఉన్నాయి. సోమవారం కూడా అవే సెగలు కొనసాగాయి. విశాఖ జిల్లా కంటే అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మరింతగా అదుపు తప్పాయి. అనేక ప్రాంతాల్లో 40–43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోకెల్లా అత్యధికంగా అనకాపల్లి జిల్లా కోటవురట్లలో 43.56 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరులో 42.42, విశాఖ జిల్లా పద్మనాభంలో 41.36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రోజంతా వడగాడ్పులు వీచాయి. రోజూ కాస్తున్న ఎండలు, వీస్తున్న వడగాడ్పుల ధాటికి జనం విలవిల్లాడుతున్నారు. సూర్యోదయం అయిన రెండు మూడు గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. సాయంత్రం అయ్యేవరకు నిప్పులు కక్కుతూనే ఉన్నాడు. జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. తప్పనిసరి అయితేనే ప్రయాణాలు చేస్తున్నారు. వచ్చే మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో వడగాడ్పులు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. జనం ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సోమవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	కోటవురట్ల	43.56
అనకాపల్లి	దేవరాపల్లి	42.82
అనకాపల్లి	నర్సీపట్నం	42.20
అనకాపల్లి	చోడవరం	41.43
అనకాపల్లి	అనకాపల్లి	40.61
అల్లూరి	చింతూరు	42.42
అల్లూరి	కూనవరం	41.60
విశాఖపట్నం	పద్మనాభం	41.36
విశాఖపట్నం	సింహాచలం	40.00

వైభవంగా గైరమ్మ సారె ఊరేగింపు



శివపార్వతుల విగ్రహాల వద్ద పూజలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



వివిధ రకాల వంటకాలతో సారె ఊరేగిస్తున్న మహిళలు

- బంగారుమెట్ట, ఎల్‌బీ పురంలో గైరమ్మ పండగ
- వంటకాలతో భారీగా తరలివచ్చిన మహిళలు
- సారె ఊరేగింపులో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల్లో గైరమ్మ పండగ సందర్భంగా సోమవారం సాయంత్రం భారీగా సారె ఊరేగింపు నిర్వహించారు. ఐదేళ్లకోసారి నిర్వహించే గైరమ్మ సంబరానికి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ నెల 24న గైరమ్మ పండగ సందర్భంగా నిర్వహించిన సారె ఊరేగింపులో రెండు గ్రామాల మహిళలు వేలాదిగా తరలివచ్చారు. ఇళ్లల్లో తయారు చేసిన పలు రకాల వంటకాలతో సారె ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పులు, వాయిద్యాలు, నేల డ్యాన్స్‌లు, బాణసంచా వెలుగుల మధ్య ఉత్సాహంగా ఊరేగింపు జరిగింది. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సారె ఊరేగింపులో పాల్గొని శివపార్వతుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పీఏసీఎస్ అధ్యక్షులు సాయం రమేష్, సర్పంచ్ మేరుగు కుమారి బాబూరావు, తమరాన శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు తమరాన దాసు, దొండా శ్రీను, యెనుముల వాసు, సాయం శేషు, దొండా రాజా, కుమార్, తమరాన రమణ, కమలనాయుడు, మణికంత, జగ్గారావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ ఘుమఘుమ

ఏపీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాఫీ క్యూరింగ్ సెంటర్‌లో కాఫీ శుద్ధీకరణ పనులు ఫిబ్రవరితో ముగిశాయి. నర్సీపట్నం సెంటర్ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఏకైక క్యూరింగ్ కేంద్రం అన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో పరిస్థితి ఆశాజనకంగా ఉంది. గత ఏడాది కంటే ఉత్పత్తి పెరగడంతో సుమారు రూ.7 కోట్ల వరకు ఆదాయం సమకూరనుందని ఏపీఎఫ్‌డీసీ అధికారులు అంచనా వేస్తున్నారు.

- నర్సీపట్నం క్యూరింగ్ సెంటర్‌లో ముగిసిన శుద్ధి పనులు
- ఈ ఏడాది 244 మెట్రిక్ టన్నుల కాఫీ గింజల క్యూరింగ్
- అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కాఫీ రూ.342
- గతేడాది కంటే ఉత్పత్తి పెరగడంతో రూ.7 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం



కాఫీ గింజలను వేరు చేస్తున్న కార్మికులు, (ఇన్‌సెట్) శుద్ధి చేసిన క్లీన్ కాఫీ

నర్సీపట్నం: ఏజెన్సీలో ఏపీఎఫ్‌డీసీ ఆధీనంలో 8 వేల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే కాఫీ గింజలను నర్సీపట్నంలోని క్యూరింగ్ సెంటర్‌లో శుభ్రం చేసి ఈ–వేలం ద్వారా విక్రయిస్తుంటారు. ఏడేళ్ల క్రితం వరకు ఈ కేంద్రంలో 1500 మెట్రిక్ టన్నుల నుంచి 2 వేల మెట్రిక్ టన్నుల వరకు కాఫీ గింజలను శుద్ధి చేసి విక్రయించేవారు. ప్రకృతి వైపరీత్యాలు, మావోయిస్టుల ప్రభావంతో కాఫీ గింజల ఉత్పత్తి 400 మెట్రిక్ టన్నులకు పడిపోయింది. కాఫీ ఉత్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు ఐదు నెలలపాటు ముమ్మరంగా క్యూరింగ్ పనులు జరిగేవి. గత ఏడాది 180 మెట్రిక్ టన్నుల కాఫీని శుద్ధి చేసి అమ్మకం చేశారు. అప్పట్లో అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.390 పలకడంతో రూ.5.80 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది 244 మెట్రిక్ టన్నుల కాఫీని క్యూరింగ్ చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో రూ.342 వరకు పలుకుతోంది. 106 మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీని ఈ–వేలం ద్వారా విక్రయించగా రూ.3 కోట్లు ఆదాయం వచ్చింది. మరో 138 మెట్రిక్ టన్నుల శుద్ధి చేసిన కాఫీ అమ్మకానికి సిద్ధంగా ఉందని కేంద్రం క్యూరింగ్ సెంటర్ నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఏప్రిల్ నెలాఖరునాటికి మిగిలిన కాఫీ అమ్మకం జరుగుతుంది. గత ఏడాదితో పోలిస్తే మార్కెట్‌లో ధర అటు ఇటుగా ఉన్నప్పటికీ ఉత్పత్తి పెరగడంతో క్లీన్ కాఫీ అమ్మకం ద్వారా సంస్థకు సుమారు రూ.7 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



నర్సీపట్నంలోని కాఫీ క్యూరింగ్ కేంద్రం

ఉత్పత్తి కలిసొచ్చింది

ఈ ఏడాది కాఫీ దిగుబడి బాగుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో గత ఏడాది కిలో కాఫీ రూ.390 పలికిన ధర ప్రస్తుతం రూ.342 వరకు ఉంది. ఈ ధర పెరిగే అవకాశం ఉంది. దిగుబడి పెరగడంతోపాటు ధర ఆశాజనకంగా ఉండటం వల్ల రూ.7 కోట్ల వరకు ఆదాయం రానుంది. అమ్మకానికి 138 మెట్రిక్ టన్నుల క్లీన్ కాఫీ సిద్ధంగా ఉంది. బ్రెజిల్ కాఫీ తగ్గడంతో ఏజెన్సీ కాఫీకి డిమాండ్ ఏర్పడింది. దీంతో పరిస్థితి అనుకూలంగా మారింది.

–ఎస్.స్వర్ణలత, డివిజనల్ మేనేజర్, కాఫీ క్యూరింగ్ సెంటర్, నర్సీపట్నం

పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిత



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

మురళీనగర్: పాలిటెక్నిక్ విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. కంచరపాలెంలోని కెమికల్ ఇంజినీరింగు కాలేజీలో పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. పదో తరగతి అనంతరం కేవలం మూడేళ్ల/మూడున్నరేళ్ల వ్యవధిలో సాంకేతిక విద్యను అభ్యసించడం ద్వారా తక్షణ ఉపాధి పొందవచ్చని చెప్పారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులు చేసిన విద్యార్థులకు కంపెనీల్లో మంచి వేతనంతో ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. ఉద్యోగాల కల్పనలో పాలిటెక్నిక్ విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఆయన వివరించారు. కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ బాలిక రూ.6.80 లక్షల అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగం సాధించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. పాలిటెక్నిక్ చేయడం వల్ల ఉద్యోగాలు పొందడం లేదా ఈసెట్ రాసి ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో నేరుగా చేరవచ్చని చెప్పారు. తక్షణ ఉపాధికి పాలిటెక్నిక్ విద్యను మించింది లేదని ఆయన పేర్కొన్నారు. ఉచిత శిక్షణ అనంతరం ఉచితంగా మెటీరియల్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు 'తిరుమల'లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరంలోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో ఈ నెల 19వ తేదీ ఉదయం 10.00 గంటలకు పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జేఈఈ (మెయిన్స్), జేఈఈ (అడ్వాన్స్‌డ్), నీట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ఈ మేరకు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో 10వ తరగతి తరువాత చేరబోయే వివిధ కోర్సుల గురించి, ఐఐటీ, ఎన్ఐటీ, నీట్ పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధంగా ఉండాలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని నున్న తిరుమలరావు తెలిపారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో గురుకులం సమన్వయాధికారి

ఆరిలోవ: జాతీయ స్థాయిలో ఇటీవల విజయవాడలో డ్రీమ్స్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమి ఫైన్ ఆర్ట్బ్స్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు జరిగాయి. ఈ పోటీలలో శ్రీకృష్ణాపురం గురుకులం విద్యార్థులు 15 స్వర్ణ పతకాలు, 10 వెండి పతకాలు సాధించారు. సోమవారం గురుకులాన్ని సందర్శించిన జిల్లా సమన్వయాధికారి ఎస్.రూపావతి విజేతలను అభినందించారు.

క్షేత్రస్థాయి విచారణతో సమస్యల పరిష్కారం



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

- అర్జీలపై కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం
- కలెక్టరేట్‌కు 214 అర్జీలు

తుమ్మపాల: స్పందన ఫిర్యాదులపై సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు జేసీ జాహ్నవి, డీఆర్వో పి.వెంకటరమణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్పందన వినతులపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ వారం మొత్తం 214 అర్జీలు నమోదయ్యాయి.

రొంగలివానిపాలెం రెవెన్యూ గ్రామాన్ని ఏర్పాటు చేయాలి...

అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం పంచాయతీని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని సర్పంచ్ రొంగలి అప్పలనాయుడు, గ్రామస్తులు స్పందనలో కలెక్టర్‌కు విన్నవించారు. కుంచంగి పంచాయతీ నుంచి మా గ్రామం కొన్నేళ్ల క్రితం ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిందని, రెవెన్యూ పరిధిని మాత్రం వేరు చేయలేదని వాపోయారు. దాంతో రెవెన్యూ పరంగా మా గ్రామానికి రావాల్సిన ఆదాయం కోల్పోతున్నామన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్.ఎస్.సి (జీడీ) ఉద్యోగాల భర్తీకి అవకాశం కల్పించాలి...

నక్సల్స్ ప్రభావిత జిల్లాగా అనకాపల్లిని చేర్చనందున ఎస్.ఎస్.సి(జీడీ) నోటిఫికేషన్‌లో అర్హత పొందినప్పటికీ అర్హుల జాబితాలో మమ్మల్ని చేర్చలేదని పలువురు యువకులు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నోటిఫికేషన్‌లో అనకాపల్లి జిల్లాగా నమోదు చేసి పరీక్షల్లో 60 మార్కులతో అర్హత సాధించినప్పటికీ, కేవలం 32 మార్కులు వచ్చిన విశాఖపట్నం యువకుల జాబితా అర్హులుగా వచ్చిందన్నారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరారు.

- బోగస్ పింఛన్ల మంజూరుపై ఫిర్యాదు

చీడికాడ మండలం ఖండివరంలో బోగస్ పింఛన్ల మంజూరు చేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎద్దు నాగరాజు స్పందనలో ఫిర్యాదు చేశాడు. పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి దివ్యాంగ కోటాలో పింఛన్లు మంజూరు చేసిన ఘటనపై ఫిర్యాదు చేయగా, పంచాయతీ కార్యదర్శి కక్ష సాధింపుతో తనపై దాడి చేసి వలంటీర్ విధులు నుంచి తొలగించారని వాపోయాడు. ఎంపీడీవో కాకుండా ప్రత్యేకాధికారితో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో సర్వే నంబరు 146-2 నాలుగెకరాల చెరువును ఆక్రమించిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన పాము జగన్నాథరావు ఫిర్యాదు చేశాడు.

- 11వ వేతన ఒప్పందం ప్రకారం క్వారీ, క్రషర్స్ కార్మికులకు జీతభత్యాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద కార్మికులు ధర్నా చేశారు. పీఏసీఎస్ ప్రైవేటీకరణ తగదని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సంబంధిత ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. రైతులు ఏర్పాటు చేసుకున్న సంఘాల ప్రైవేటీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని, జీవో నంబరు 36 ప్రకారం ఉద్యోగుల జీతాలు చెల్లించాలని, ఇన్‌కమ్‌ట్యాక్స్ పరిధి నుంచి పీఏసీఎస్‌లను మినహాయించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు శంకరరావు, యూనియన్ అధ్యక్షుడు పి.నాగభూషణం, మల్ల స్వామి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

టెంట్ కింద ద్విచక్ర వాహనాలతో...

స్పందన అర్జీదారులకు ఏర్పాటు చేసిన నీడలో ఉద్యోగులు తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేశారు. ప్రతి సోమవారం స్పందనకు వచ్చే అర్జీదారుల కోసం ఇక్కడ కొన్ని నెలల క్రితం టెంట్ ఏర్పాటు చేశారు. ఈ వారం టెంట్ కింద ద్విచక్ర వాహనాలతో దర్శనమిచ్చాయి. దాంతో ఎండలో వచ్చిన అర్జీదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కలెక్టరేట్ ప్రాంగణంలో నీడ లేక చెట్ల కింద సేద తీరుతూ అర్జీలు నమోదు చేయించుకున్నారు.



స్పందన అర్జీదారుల టెంట్ కింద ఉద్యోగుల ద్విచక్రవాహనాలు

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: చట్ట పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఆయన 37 అర్జీలు స్వీకరించారు. వాటిలో కొన్ని సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడారు. అర్జీదారుల సమక్షంలో చట్ట పరిధిలో సమస్యలపై చర్యలు చేపట్టి న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

చదువుతోనే పేదరికాన్ని జయించొచ్చు



వీడ్కోలు కార్యక్రమంలో పది విద్యార్థులతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: ప్రతీ విద్యార్థి పేదరికాన్ని జయించాలంటే, ఏకైక మార్గం చదువేనని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సోమవారం ఎ.కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయి మౌలిక వసతులతోపాటు కార్పొరేట్ విద్యా బోధన అందించేందుకు కోట్లాది రుపాయల నాడు-నేడు నిధులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తద్వారా విద్యార్థులకు మంచి చదువులతోపాటు ఉన్నత స్థానాలకు చేరుకునేలా పూర్తి సహకారాన్ని కల్పించే చర్యలను తీసుకుంటున్నారని కొనియాడారు. ప్రతిభ విద్యార్థుల ఉన్నత చదువులకు తనవంతు సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. జెడ్పీటీసీ ఈర్లె అనురాధ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలన్నారు. హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, రమాదేవి, ఎరుకునాయుడు, అమృతరావు, పీడీ ప్రసాద్, పీఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఎల్.అర్జున్, మోహన్‌రావు, పుట్టా శ్రీధర్, బి.దేముడుబాబు పాల్గొన్నారు.

నాటి వైస్ ఎంపీపీ... నేడు ఉపాధ్యాయుడిగా!

- 98 డీఎస్సీలో మంగపతికి పోస్టింగ్





వైస్ ఎంపీపీ హోదాలో గొండుపాలెంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న మంగపతి(ఫైల్) (ఇన్‌సెట్) మంగపతి

కె.కోటపాడు: అనుకోకుండా రాజకీయాల్లో వచ్చిన ఆయన వైస్ ఎంపీపీ అయ్యారు. అప్పటి నుంచి రాజకీయాల్లో బిజీగా మారిన తనిప్పుడు ఉపాధ్యాయుడిగా పాఠాలు బోధించేందుకు సిద్ధమయ్యారు. కె.కోటపాడు మండలం గొండుపాలెం గ్రామానికి చెందిన బండారు మంగపతి 2014-19 వరకు వైస్ ఎంపీపీగా పనిచేశారు. 1998-డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల పోస్టింగ్‌లపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న చరిత్రాత్మకమైన నిర్ణయంతో అతడికి ఉపాధ్యాయ కొలువు సాకారమైంది. పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేసి ఉమ్మడి విశాఖ జిల్లాలో 352 మంది కుటుంబాల్లో వెలుగులు నింపారని మంగపతి ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2014 ఎంపీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఈయన్ను 1,786 ఓట్ల మెజార్టీతో గ్రామస్తులు గెలిపించారు. తదనంతరం వైస్ ఎంపీపీగా సభ్యులంతా ఎన్నుకున్నారు. సీఎం జగన్ పాలనపైనా, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నాయకత్వంలో పని చేసేందుకు ఆసక్తితో 2019లో వైఎస్సార్‌సీపీలో చేరారు. నాటి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల 98-డీఎస్సీ కౌన్సెలింగ్‌లో అనంతగిరి మండలం చింతలపాక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయునిగా నియమితులయ్యారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు మంచి చదువులతో పాటు నైతిక విలువలు మరింత పెంపొందించేలా విద్యా బోధనను అందించనున్నట్లు మంగపతి తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

నాతవరం : ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్న వారు స్వచ్ఛందంగా వైదొలగకపోతే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ పి.కనకరావు హెచ్చరించారు. మండలంలో మన్యపురట్ల గ్రామ సమీపంలో ఏపీ పురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 38/1, 38/2లో సుమారుగా 4.90 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించుకున్నారన్నారు. అయా భూమిని కలెక్టరు ఆదేశాల ప్రకారం సోమవారం సర్వే చేసి ఆక్రమణలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఈ భూమిలో స్థానికులు ఆక్రమించుకుని వ్యవసాయం సాగు చేసుకునే సమయంలో హెచ్చరికలు చేశామన్నారు. ప్రస్తుతం ఈ భూమిలో ఎలాంటి కట్టడాలు గాని వ్యవసాయ పంటలు ఏమీ లేవని, ఖాళీ భూమి ఉందని అన్నారు. తమకు వచ్చిన సమాచారం మేరకు ఆ భూమిలో ఆక్రమించుకుని సాగు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న వదంతులతో రెవెన్యూ శాఖ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ఈ భూమిలోకి ఎవరూ వెళ్లరాదని భూమిపై తలయారీలను కాపలా ఉంచామన్నారు. ఈ భూమికి సంబంధించి ఎవరి వద్దనైనా ఎలాంటి రికార్డులు ఉన్నా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ప్రభుత్వానికి సంబంధించి భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. మండల వ్యాప్తంగా దండోరా ద్వారా ప్రభుత్వ భూములు ఆక్రమణ చేసిన వారిని దృష్టిలో పెట్టుకుని తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు ఆర్ఐ నారాయణరావు వీఆర్వోలు భూపతిదేవ్ గణేష్,బాబు సర్వేయరు విజయ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

జ్యోతిర్మయ ట్రస్టుకు ఎక్కడా బ్రాంచ్‌లు లేవు

- ట్రస్ట్ పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తే చర్యలు
- ట్రస్ట్ సభ్యులు వెల్లడి

బుచ్చెయ్యపేట: జ్యోతిర్మయ ట్రస్ట్‌కు దేశంలో ఎక్కడా బ్రాంచ్‌లు లేవని ట్రస్ట్ సభ్యులు స్పష్టం చేశారు. మండలంలోని కొమళ్లపూడి శివారు అమరపురిలో జ్యోతిర్మయ బాబా ఆశ్రమం వద్ద సోమవారం విలేకరుల సమావేశంలో ట్రస్ట్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ, సెక్రటరీ వై.జి. వెంకయ్య మాట్లాడారు. ఇటీవల కొన్ని గ్రామాల్లో జ్యోతిర్మయ బాబా ట్రస్ట్‌ట్ పేరు చెప్పుకుని చందాలు వసూలు చేయడం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై ఎవరైనా ఇలాంటివి చేస్తే లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తుల విరాళాలతోనే జ్యోతిర్మయ సేవా కార్యక్రమాలన్నీ అమరపురిలోనే చేస్తున్నామన్నారు. ఇటీవల విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ద్వారా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బి.వి. సత్యవతిలను కలవగా రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో కొండపైన బాబా దివ్య సమాధి వద్ద భక్తుల సౌకర్యార్థం వంటశాలతోపాటు మరో రూ.3 లక్షలతో మంచినీటి ట్యాంక్, పైప్ లైన్ ఏర్పాటు చేశామన్నారు. జ్యోతిర్మయి బాబా మహిమ గురించి ప్రపంచానికి తెలిసేలా ఆయన రచించిన దివ్య గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించి వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు. ఇక్కడ సంజీవిని వనాన్ని అభివృద్ధి చేయడంతోపాటు ఆధ్యాత్మిక కేంద్రంగా ఆశ్రమాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. ట్రస్ట్ ఉపాధ్యక్షుడు సాయిబాబా, కోశాధికారి కృష్ణయ్య చౌదరి, మెంబర్ శరకాన బాబూరావు పాల్గొన్నారు.

విన్యాసాలు వావ్

మండుతున్న ఎండ..వెండివర్ణంలో సంద్రం..ఉరకలేసే విన్యాసం .. జలధి సన్నిధిలో కుర్రాళ్లు విన్యాసాలు వావ్ అనిపించాయి. నవీన భంగిమల్లో కళ్లు చెదిరే, గుండెలదిరే సాహసాలతో అబ్బురపరిచారు.. ఫిషింగ్ హార్బర్‌లో కొందరు యువకులు ఇలా విన్యాసాలతో అలరించారు. ఎండ నుంచి ఉపశమనం పొందారు.



- ఫొటో : ఎమ్‌డి నవాజ్, సాక్షి ఫొటోగ్రాఫర్

సమయపాలన పాటించాల్సిందే..

- అధికారుల గైర్హాజరుపై మండిపడ్డ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో గ్రీవెన్స్ నిర్వహించే రోజున అధికారులందరూ సమయపాలన పాటించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వచ్చే వినతులపై వచ్చే గ్రీవెన్స్ నాటికి అధికారుల వద్ద స్టేటస్ ఉండాలని, మొక్కుబడిగా చెప్పే ప్రసక్తే లేదన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి కమిషనర్ సాయికాంత్ వర్మ సరిగ్గా 11 గంటలకు వచ్చారు. అప్పటికి పలువురు అధికారులు గ్రీవెన్స్ సెల్‌కు హాజరుకాలేదు. దీంతో కమిషనర్ మండిపడ్డారు. కచ్చితంగా అటెండెన్స్ షీట్ పెట్టాలని ఆదేశించారు. ఆ తర్వాత ఒక్కొక్క అధికారి గ్రీవెన్స్ సెల్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న వినతులపై ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించి వివరాలను వచ్చే స్పందనలోగా సిద్ధం చేయాలన్నారు. ఆయా వివరాలను తరువాత వారంలో అందించడం వల్ల నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నాయో తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందని సూచించారు.

34 కిలోల గంజాయి పట్టివేత

- ఐదుగురికి రిమాండ్

కొయ్యూరు : మర్రివాడ పంచాయతీ దొడ్డవరం శివారులో ఆటో అడుగు భాగాన ఉంచి తరలిస్తున్న 34 కిలోల గంజాయిని పట్టుకుని ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో సోమవారం దొడ్డవరం శివారులో వాహనాల తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో చింతపల్లి ప్రాంతం నుంచి కాకరపాడు మీదుగా కత్తిపూడి హైవే నుంచి వెళ్లేందుకు ఇద్దరు ద్విచక్ర వాహనాలపై, మరో ముగ్గురు ఆటోపై వస్తున్నారు. పోలీసులను చూడగానే బైక్‌లను వెనక్కు తిప్పి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి కొయ్యూరు ఎస్ఐ రాజారావు పట్టుకున్నారు. తిరుపతికి చెందిన కావిడి వెంకటేశ్, గూడెం కొత్తవీధికి చెందిన ముప్పాల గణేశ్, కృష్ణబాబు, చింతపల్లికి చెందిన కించె సన్యాసిరావు, పాంగి నాగేంద్రబాబులను రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి నాలుగు మొబైల్ ఫోన్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

నిర్దేశిత సమయానికే దర్శనం

- ఈసారి ప్రొటోకాల్‌లోనూ టైమ్ స్లాట్స్ విభజన
- సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- చందనోత్సవానికి కలెక్టర్ ప్రత్యేక ఏర్పాట్లు

సాక్షి, విశాఖపట్నం : సింహగిరిపై ఉన్న వరహాలక్ష్మీ నరసింహ స్వామి చందనోత్సవానికి అధికార యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా స్వామివారి నిజరూప దర్శనం కోసం ఏటా లక్షలాది మంది భక్తులు సింహగిరికి చేరుకొని దర్శించుకుంటారు. భక్తులు పోటెత్తడంతో ఆ ప్రాంతంలో రద్దీ వాతావరణం నెలకొంటుంది. గత ఏడాది గతంలో టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ సమయంలో బోర్డు మెంబర్లు ఒకేసారి దర్శనానికి రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. గంటపాటు దర్శన సమయంలో తోపులాటలు జరగడం పలు విమర్శలకు దారితీసింది. ఈసారి అలాంటి పొరపాట్లు దొర్లకుండా స్లాట్ల విభజనతో దర్శనం చేసుకునేలా కలెక్టర్ డా.మల్లికార్జున ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించారు. సింహాచలం ఈవో త్రినాథరావు, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, ఇతర అధికారులతో పలుమార్లు సమీక్ష నిర్వహించి ఏర్పాట్లుపై ప్రత్యేక శ్రద్ధవహించారు. గతేడాది వచ్చిన విమర్శలు ఈ ఏడాది రాకుండా నిజరూప దర్శనం ముగిసేంత వరకూ ప్రణాళికాబద్ధంగా దర్శనాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.



రూ.1000 టికెట్లకు 5 స్లాట్లు

ఏటా నిజరూపదర్శనం వేకువ జామున మొదలవుతుంది. తొలుత ఏటా వస్తున్న సంప్రదాయం ప్రకారం ఆలయ అనువంశిక ధర్మకర్త కుటుంబీకులు స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ అనంతరం దేవదాయ శాఖ మంత్రి దర్శనం చేసుకోనున్నారు. గతంలో ఈ సమయంలో అస్తవ్యస్తంగా మారింది. ఇప్పుడా పరిస్థితి తలెత్తకుండా విభజిం చనున్నారు. బోర్డు మెంబర్లకు కూడా స్లాట్ ఏర్పాటు చేస్తున్నారు. బోర్డు మెంబర్లకు ఇచ్చే టికెట్స్‌లో ఫస్ట్ స్లాట్‌లో 1 ప్లస్ 5 మాత్రమే అనుమతించనున్నారు. బోర్డు మెంబర్ల వద్ద మిగిలి ఉన్న టికెట్స్‌ను స్లాట్-2, స్లాట్-3లో దర్శనానికి అనుమతిస్తారు. ప్రొటోకాల్‌లోనూ టైమ్ స్లాట్లుగా పంపించాలని భావిస్తున్నారు. ప్రతి టికెట్‌పైనా టైమ్ స్లాట్ నిర్దేశించనున్నారు. రూ.1000 టికెట్స్‌కు 5 స్లాట్స్‌గా విభజించారు. ప్రతి 3 గంటలకు ఒక స్లాట్ ఇవ్వనున్నారు. ఇలా టైమ్ స్లాట్స్ ఇవ్వడం వల్ల నిర్దేశించిన సమయానికి మాత్రమే భక్తులు వస్తారని, దీనివల్ల దర్శన రద్దీతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తలెత్తవని అధికారులు భావిస్తున్నారు. టైమ్‌స్లాట్స్, పాసుల కేటాయింపు, టికెట్స్ జారీపై మంగళవారం లేదా, బుధవారం కలెక్టర్ డా.మల్లికార్జున అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ఆన్‌లైన్‌లో చందనోత్సవం టికెట్లు

నేటి నుంచి అందుబాటులోకి..

సింహాచలం: సింహగిరిపై ఈనెల 23న జరిగే చందనోత్సవానికి రూ.300, రూ.1000 టికెట్లు మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. www.aptempeles. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా భక్తులు టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే సింహాచలంలోని యూనియన్ బ్యాంక్, స్టేట్‌బ్యాంకుల్లో కూడా టికెట్లు విక్రయిస్తామని పేర్కొన్నారు. కాగా సింహాచలం దేవస్థానం చరిత్రలో చందనోత్సవం టికెట్ల విక్రయం ఆన్‌లైన్ ద్వారా జరపడం ఇదే తొలిసారి కావడం విశేషం.

క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం



గ్యాస్ సిలిండర్ మంటలు అదుపు చేయడంపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనకాపల్లిటౌన్ : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆ శాఖ అధికారి బి.నరసింగరావు ప్రజలకు అవగాహన కల్పించారు. డీఏవీ, సంయుక్త పబ్లిక్ స్కూళ్లలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు జరిగాయి. పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు గ్యాస్ సిలిండర్ నుంచి వ్యాపించే మంటల్ని ఎలా అదుపు చేయాలో మాక్ డ్రిల్ ద్వారా వివరించారు. తొలుత అగ్ని ప్రమాద నియంత్రణ చర్యలపై రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మళ్ల సత్యనారాయణ ఇక లేరు

అనకాపల్లిటౌన్ : సీనియర్ కార్మిక నేత మళ్ల సత్యనారాయణ(64) సోమవారం తుదిశ్వాస విడిచారు. ఈయన కౌన్సిలర్‌గా, వర్తకసంఘం, ఆదినారాయణ ఉన్నత పాఠశాల పాలకవర్గ అధ్యక్షునిగా, ఏఎంఏఎల్ కళాశాల కరస్పాండెంట్‌గా పలు పదవులు అలంకరించారు. పలు కార్మికసంఘాలకు గౌరవాధ్యక్షునిగా వ్యవహరించారు. అందరితో స్నేహపూర్వకంగా మెలిగే సత్యనారాయణ మృతి తీరనిలోటని సీపీఎం, సీఐటీయూ నాయకులు సంతాపం తెలిపారు. ఈయన అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

నాగవరంలో నేడు పోలిపల్లెమ్మ పండగ



నాగవరంలోని పోలిపల్లెమ్మ తల్లి

మునగపాక : మండలంలోని నాగవరంలో మంగళవారం పోలిపల్లెమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహిస్తున్నట్టు మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదే రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని అప్పారావు కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 3,077 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,039	4,140
మొదటి రకం	3,850	4,080
రెండో రకం	3,420	3,820
మూడో రకం	3,320	3,410

అనకాపల్లి సినిమాలు

రుద్రుడు	రాజా
మీటర్	సత్యనారాయణ స్క్రీన్-1
డంజన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణ స్క్రీన్-2
రావణాసుర	షిర్డీసాయి
శాకుంతలం (3డి)	పర్తిసాయి
విడుదల(పార్ట్-1)	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-34 యూనిట్లు, ఓ పాజిటివ్-44 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 319 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 211 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

రైతులకు మరింత భరోసా



అనకాపల్లి మండలం కుంచంగి వద్ద ఈక్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది



జనపనార పంటకు ఈ పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకురాలు

- ఆర్బీకేల్లో వీఏఏలకు సాయంగా ఆర్బీకే మిత్రలు
- అనకాపల్లి సబ్ డివిజన్‌లో 94 మంది నియామకం
- రైతులకు మరింత చేరువకానున్న ఆర్బీకే సేవలు

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ద్వారా వ్యవసాయదారులకు గ్రామస్థాయిలోనే పలు సేవలు అందుతున్నాయి. గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ) పంట సాగులో రైతులకు అనునిత్యం క్షేత్రస్థాయిలో సహాయకారులుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం ఈ సేవల్ని మరింత విస్తృతపరచేలా ఆర్బీకే మిత్రలను ప్రభుత్వం నియమించింది. ఆయా ఆర్బీకేల పరిధిలో వీఏఏలకు అనుబంధంగా ఆసక్తివున్న వలంటీర్లను ఆర్‌బీకే మిత్రలుగా నియమించారు. వీరంతా వీఏఏలకు సహాయంగా, సమన్వయంతో పనిచేస్తూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించనున్నారు.

రైతు బాంధవుడు జగన్

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైన నుంచి రైతాంగానికి, వ్యవసాయానికి బాసటగా నిలుస్తోంది. వ్యవసాయాన్ని ఆదుకునేందుకు విప్లవాత్మకమైన చర్యలు చేపట్టింది. రైతుల కోసం గ్రామాల్లోనే ఆర్బీకేలు ఏర్పాటుచేసి పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనల నుంచి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేస్తోంది. పంటల బీమా, రైతు భరోసా వంటి పథకాలను అమలుచేస్తూ రైతాంగానికి అండగా నిలుస్తోంది. తాజాగా ఆర్బీకేల్లో నియమించిన వీఏఏలు క్షేత్రస్థాయిలో రైతుల వ్యవసాయ క్షేత్రాల్లోకి వెళ్లి సాగులో సలహాలు, సూచనలు అందిస్తున్నారు. వీరికి సహాయకారులుగా ఇపుడు ఆర్బీకే మిత్రలను నియమించారు.

అనకాపల్లిలో 94 మంది ఆర్బీకే మిత్రలు

రైతు భరోసా కేంద్రాల్లో సేవలందించేందుకు వీఏఏలకు సాయంగా కొత్తగా ఆర్బీకే మిత్రలను ఏర్పాటు చేశారు. వీరు వీఏఏలు అందుబాటులో లేని సమయంలో రైతులు ఆర్బీకేలకు వచ్చినపుడు వారికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించడంతో పాటు, వారి అవసరాలను నమోదు చేసుకుంటారు. అనకాపల్లి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో మునగపాక, కశింకోట, అనకాపల్లి, సబ్బవరం, పరవాడ మండలాల్లో 94 ఆర్బీకేలున్నాయి. వీటన్నింటిలో వీఏఏలకు సపోర్ట్‌గా 94 మంది ఆర్బీకే మిత్రలను నియమించినట్టు అధికారులు తెలిపారు.

వీఏఏలకు ప్రత్యేక బాధ్యతలు

అనకాపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని వీఏఏలు రైతుల పొలాల్లోకి వెళ్లి పంట సాగు ఇబ్బందులు, పురుగు మందుల పిచికారీ మోతాదు, పంట పెరుగుదల లోపాలు, మార్కెట్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు తదితర అంశాలపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచలను అందిస్తున్నారు. ఇక మీదట వీరు నేరుగా పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలించి, సమస్యలేమైనా ఉంటే గుర్తించి, అవసరమైన నివారణా చర్యలపై రైతులకు అవగాహన కల్పించేలా బాధ్యతల్ని అప్పగించారు. పంట సాగులో సమస్యలుంటే, ఆ వివరాలను వ్యవసాయాధికారులకు, శాస్త్రవేత్తలకు తెలియజేయాలి. సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే నేరుగా సంబంధిత శాస్త్రవేత్తలే పొలంలోకి వెళ్లి సమస్య నివారణకు తీసుకోవాల్సిన చర్యల్ని వివరించేలా వీరు సంధానకర్తలుగా పనిచేయనున్నారు.

పరిష్కారం.. మరింత వేగం



ఆర్బీకేల్లో వీఏఏలకు మరింత సహకరించేలా ఆర్బీకే మిత్రలను నియమించాం. దీంతో రైతులకు మరిన్ని సేవలందించే అవకాశం కలుగుతుంది. వీరు ఆర్బీకే కేంద్రాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. దీంతో రైతుకు పంట సాగులో ఏ సమస్య వచ్చినా, పరిష్కారం త్వరితగతిన దొరుకుతుంది.

– ఎం.రామారావు, ఏడీఏ, అనకాపల్లి

పొంచి ఉన్న ప్రమాదం



లంకెలపాలెం రహదారిలో రోడ్డు పక్కన నిలిపిన భారీ వాహనాలు

పరవాడ: నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల పక్కన నిలుపుతున్న భారీ వాహనాలతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా అధికారుల్లో చలనం రాలేదు. ముఖ్యంగా లంకెలపాలెం-పరవాడ, పరవాడ-వాడచీపురుపల్లి రహదారుల్లో బూడిద, బొగ్గు లారీలను ఎక్కడికక్కడ రోడ్ల పక్కన నిలిపేస్తున్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాంకీ కూడలి, మండల కాంప్లెక్సు, సినిమాహాలు కూడలి, ఊటగెడ్డ కూడలి, ఎన్టీపీసీ మెయిన్‌గేటు ప్రాంతాల్లో భారీ వాహనాలు రోడ్ల పక్కన నిలిపి లారీ సిబ్బంది టిఫిన్, భోజనాలకు వెళ్తున్నారు. దీంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇదంతా కళ్లారా చూసినా ట్రాఫిక్ పోలీసులు నిమ్మకునీరెత్తి వ్యవహరించడం వల్ల లారీ డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి నిబంధనలకు విరుద్ధంగా లారీలు నిలుపుతున్న సిబ్బందిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారి భద్రతపై ర్యాలీ



లాలంకొత్తూరులో రహదారి భద్రతపై స్వయం సహాయక సంఘాల ర్యాలీ

కశింకోట : మండలంలోని లాలం కొత్తూరు గ్రామంలో రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని కోరారు. ర్యాలీలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు న్యాయం చేయాలి



అచ్యుతాపురం జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న ముఠా కార్మికులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ముఠా కార్మికులకు న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాము డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ముఠా కార్మికులతో కలిసి సీఐటీయూ మానవహారం నిర్వహించింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ సెజ్‌లో రసూల్ డెక్కర్ షైవుడ్ యాజమాన్యం మొండి వైఖరి కనబరుస్తోందని ఆరోపించారు. సెజ్ ఏర్పాటు కోసం రైతులు భూములిస్తే ఇక్కడ భూములు కోల్పోయి కూలీగా మారిన వారి పట్ల కర్మాగార యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఠా కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఏపీఐఐసీ జడ్ఎం, లేబర్ అధికారులు, తహసీల్దార్లు తక్షణం దీనిపై విచారణ జరిపి ముఠా కార్మికులకు న్యాయం చేయాలని, గత 12 రోజులుగా శాంతియుతంగా నిరసన తెలిపినప్పటికీ ఎవరూ స్పందించకపోవడం అన్యాయం అని అన్నారు. గొర్లె సూరిబాబు, అప్పలనాయుడు, నగేశ్, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ



ప్రచార భేరి పోస్టర్ల ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

మునగపాక : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఐ మండల కార్యదర్శి మళ్ల మాధవరావు విమర్శించారు. సోమవారం మునగపాకలో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలు చేయడం లేదన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టడం విచారకరమన్నారు. కార్యక్రమంలో ఆళ్ల మహేశ్వరరావు, బ్రహ్మాజీ, జగ్గారావు, దాడి శివరామ్, ఆడారి రామారావు, మళ్ల సతీష్, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం



మునగపాకలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్ఐ ఆలీ

మునగపాక : వేసవి తాపం నుంచి కాపాడేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని మునగపాక ఎస్ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి పాల్గొన్నారు.

ఘాటెక్కిన కారం

- అమాంతం పెరిగిన ఎండు మిర్చి ధరలు
- మసాలా కారం తయారీ వస్తువులదీ అదే దారి



కశింకోట సంతలో విక్రయిస్తున్న కారం సరకులు

కశింకోట : కారం తింటే కాదు.. కొంటే కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. వంటలో వేసే కారం తయారీకి వినియోగించే సరకుల ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రధానంగా ఎండుమిర్చి, జీలకర్ర ధరల్లో భారీ పెరుగుదల నెలకొంది. రెండు వారాల వ్యవధిలో ఎండు మిరపకాయలు రకాన్ని అనుసరించి కిలోకి రూ.50, జీలకర్ర నాణ్యతనుబట్టి రూ.140 వరకు అదనంగా పెరిగింది. దీంతో ప్రజలు కారం తయారీకి వినియోగించే సరకుల కొనుగోలుకు భయపడుతున్నారు.

వేసవిలోనే కారం తయారీ

వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతంలో చాలా కుటుంబాలు ఎవరి ఇష్టం మేరకు వారు పలు రకాల మసాలా దినుసులు వేసుకుని, కారం తయారు చేసి, నిల్వ చేసుకుంటున్నారు. పచ్చళ్లు, కూరలకు ఏడాదంతా దీన్నే వినియోగిస్తారు. అధిక ఉష్ణోగ్రతలుండే వేసవిలో కారం తయారు చేస్తే తేమ లేకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. దీంతో వేసవిలోనే ఎక్కువ మంది కారం తయారు చేసుకునేందుకు మొగ్గు చూపుతారు. కారం తయారీలో ప్రధానంగా పొడవు, పొట్టి రకాల ఎండు మిరపకాయలు వినియోగిస్తారు. పొడవు రకం కారం ఘాటు ఎక్కువగా ఉంటుందని, పొట్టి రకం కారం ఘాటు తక్కువగా ఉండి పరిమాణం ఎక్కువ వస్తుందని రెండు రకాలు వినియోగిస్తారు. అయితే ప్రస్తుతం పొట్టి రకం మిరపకాయలు రావడం అరుదుగా మారింది. దీంతో పొడవు రకం మిరప కాయలతో ఎక్కువగా కారం తయారు చేసుకుంటున్నారు.

స్థానిక మిర్చికి డిమాండ్

స్థానికంగా పండించే మిరపకాయల కంటే గుంటూరు మిర్చికి కాస్త డిమాండ్ ఎక్కువ. గుంటూరు మిర్చీకి ఘాటెక్కువ. మరి కొందరు గుంటూరు మిర్చి కంటే స్థానికంగా పండే మిర్చి ఆరోగ్యపరంగా మంచిదని, దాన్నే కారంలో వినియోగిస్తారు. దీంతో గుంటూరు మిర్చి కంటే స్థానిక మిర్చి ధరే కిలోకు రూ.50 వరకు అధికంగా ఉంది. ఈ మిర్చిని మండలంలోని వినన్నపేట, జమాదులపాలెం, కన్నూరుపాలెం, సుందరయ్యపేట, తీడ, చెరకాం, జి.భీమవరం, అనకాపల్లి మండలంలోని సంపతిపురం, తమ్మయ్యపేట తదితర గ్రామాల్లో పండిస్తారు. ఆయా గ్రామాల నుంచి రైతులు కశింకోట, తాళ్లపాలెం సంతలకు తెచ్చి నాటు మిరపకాయలు విక్రయిస్తారు. వీటిని గంపలు, బస్తాల కొలతలు, తూనికతో కొనుగోలు చేస్తారు. వీటి ధర కిలో రూ.300కు విక్రయిస్తున్నారు. గత రెండు వారాల క్రితం కిలో రూ.250 ఉండేది. ప్రస్తుతం అది రూ.50 అదనంగా పెరిగింది. అలాగే గుంటూరు మిరపకాయలు కిలో రూ.220 నుంచి ఒక్కసారిగా రూ.250కి పెరిగింది.

ధర పెరిగిన జీలకర్ర

ఇక మసాలా కారం తయారీలో మరో ప్రధానమైన సరకు జీలకర్ర ధర కూడా అధికంగా పెరిగింది. పది రోజుల క్రితం వరకు కిలో రూ.350 ఉండగా, ఇప్పుడు రూ.490కి పెరిగింది. ఉత్పత్తి తక్కువగా ఉండటంతో వీటి ధరలు ఒక్కసారిగా పెరిగాయని వ్యాపారులంటున్నారు. ధరలు పెరిగినప్పటికి ప్రత్యామ్నాయం లేక వీటిని కొనుగోలు చేసి కారం తయారు చేసుకోవడంలో నిమగ్నమవుతున్నారు. ఇక కారంలో వేసే పసుపు, ధనియాలు, ఆవాలు, మెంతులు, వెల్లుల్లి తదితర సరకుల ధరలు మాత్రం దాదాపు నిలకడగా ఉన్నాయి.

నీటి ఎద్దడి నివారణ చర్యలకు వినతి



కేదార్‌నాథ్‌తో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లిటౌన్ : వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులను ప్రజాసంఘాల నేతలు ఓ వినతిపత్రం ద్వారా కోరారు. స్థానిక జీవీఎంసీ వాటర్‌సప్లై ఏఈ కేదార్‌నాథ్‌తో సోమవారం వారు సమావేశమయ్యారు. కుళాయిల ద్వారా పరిశుభ్రమైన మంచినీటిని అందించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల నమోదుతో ప్రజల దాహార్తి, ఇంటి అవసరాలు తీరేలా రెండు పూటలా కుళాయిల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. వాటర్ ట్యాంకర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. పట్టణంలో కొన్ని చోట్ల మంచినీటి పైపు లైన్లకు రంధ్రాలు ఏర్పడి నీరు వృథాగా పోతోందని, వాటికి మరమ్మతులు చేయించి, నీటి వృథాను అరికట్టాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, మాజీ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజు, భర్నికాన సూరిబాబు, బొడ్డు పరమేశ్వరరావు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీలూ జాగ్రత్త'



కూలీలతో మాట్లాడుతున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్/అనకాపల్లి రూరల్ : ఉపాధి పనుల చేసేవారంతా వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. మండలంలో పాపయ్యసంతపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు జరిగే ప్రదేశంలో తాటాకుపందిళ్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. కూలీలు పని చేసే చోట తప్పనిసరిగా మంచినీరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో చిన్న చిన్న గాయాలైన కూలీలకు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచి, సత్వర వైద్యం అందించాలన్నారు. రూ.272 వేతనం దక్కేలా సరైన కొలతలు ఇచ్చి పని చేయించాలని, కూలీలు పూర్తి వేతనం తీసుకునేలా చూడాలన్నారు. ఏపీడీ మణికుమార్, ఏపీవో సుప్రియ, సర్పంచ్‌లు అన్నం చెల్ల య్యమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు బొండా అప్ప లరాజు, మోహనరావు, నరసింహారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



ప్రకృతి వ్యవసాయ ప్రణాళికపై రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళల ర్యాలీ



ప్రకృతి వ్యవసాయం పోస్టర్ల ఆవిష్కరణ

కశింకోట : మండలంలోని ప్రకృతి వ్యవసాయం నిర్వహిస్తున్న గ్రామాల్లో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళిక 2023-24పై అవగాహన కల్పిస్తూ సోమవారం పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. చెరకాం, ఆనందపురం, సుందరయ్యపేట, అచ్చెర్ల, మోసయ్యపేట, జి.సింగవరం జరిగిన ర్యాలీల్లో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించి ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. నవ ధాన్యాలు, 30 రకాల చిరు ధాన్యాల సాగుపట్ల దృష్టి సారించాలన్నారు. అనారోగ్యానికి కారణమైన రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని హెచ్చరించారు. సేంద్రియ ఎరువులు వాడి నేలను ఆరోగ్యకరంగా ఉంచాలని, ప్రకృతి సిద్ధంగా పంటలను పండించి ఆరోగ్యకర ఉత్పత్తులను ప్రజలకు అందించాలని సూచించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది డి.రమణ, దేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారరు.

జోరుగా.. హుషారుగా

- జగనన్నే మా భవిష్యత్తుకు అపూర్వ ఆదరణ



వెన్నలపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్లు, స్టిక్కర్లతో నాయకులు

పరవాడ: జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పెందుర్తి నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. గడపలకు వెళుతున్న నాయకులకు ప్రజలు ఆపూర్వ సాగ్వతం పలుకుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు తమకు భరోసా ఇచ్చాయని లబ్ధిదారులు చెప్పడంతో నాయకులు రెట్టించిన ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

- వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు ఆధ్వర్యంలో నాయకులు మాసవరపు ముత్యాలునాయుడు, వెన్నల సింహాద్రి ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న కాలంలో పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలను కోరారు.
- వాడచీపురుపల్లిలో గృహ సారథులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.
- రావాడలో గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వారు పొందుతున్న లబ్ధిని వివరించారు. లబ్ధిదారులు స్వయంగా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను తమ ఇళ్లపై అతికించుకోవడానికి ముందుకు వచ్చారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ



అగ్నిప్రమాద సమయంలో చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: విద్యార్థులు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు మరింత మందికి అవగాహన కల్పించాలని సబ్బవరం అగ్నిమాపక అధికారి దిలీప్ కుమార్ కోరారు.జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరచూ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న అంశాలపై అగ్నిమాపక సిబ్బంది డెమో నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలను వివరించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్ కె. అప్పలనాయుడు,డ్రైవర్ ఆపరేటర్ సీహెచ్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తాటి ముంజెలకు గిరాకీ



తాటికాయల నుంచి ముంజులు వేరుచేస్తున్న దృశ్యం

మునగపాక : వేసవి కాలం తీవ్రత ఎక్కువ కావడంతో తాటి ముంజెలకు గిరాకీ ఏర్పడింది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పలువురు తాటి ముంజెలను ఆశ్రయిస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ముంజెలను తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో గిరాకీ పెరిగి తాటి కాయను రూ.10కు విక్రయిస్తున్నారు. డజను ముంజెలను రూ.40 నుంచి రూ.50కు విక్రయిస్తున్నారు.

పోతురాజుబాబు పండగ

కోటవురట్ల : పాముల వాకలో పోతురాజుబాబు పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మండల స్థాయి కోలాటం పోటీలు కనువిందు చేశాయి. ఈ పోటీల్లో నాతవరం, బోనంగి(పరవాడ), యరకన్నపాలెం(నర్సీపట్నం)బృందాలు బహుమతులు పొందాయి.